శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయం

కృషి విజ్ఞాన కేంద్రం - లాం, గుంటూరు

ICAR - ATARI ZONE - X



# శాస్త్రీయ పద్ధతిలో పందుల పెంపకం


డా॥ సౌజన్య లక్ష్మి,  డా॥ యుగంధర్ కుమార్,

డా॥ శోభామణి,  డా॥షేక్ యన్ మీరా

శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయం
**కృషి విజ్ఞాన కేంద్రం - లాం, గుంటూరు**
**ICAR - ATARI ZONE - X**

# శాస్త్రీయ పద్ధతిలో పందుల పెంపకం

## సంకలనం

డా. ఆర్. కె. సౌజన్య లక్ష్మి, శాస్త్రవేత్త (వెటర్నరి) KVK, Guntur
డా. యం. యుగంధర్ కుమార్,  ప్రధాన శాస్త్రవేత్త, KVK, Guntur
డా. బి.శోభామణి విస్తరణ సంచాలకులు, SVVU Tirupathi
డా. షేక్  ఎన్. మీర, డైరెక్టర్,ICAR- ATARI- Zone-X

# విషయ సూచిక


| S.no | అంశము | Page No. |
|---|---|---|
| 1. | పందుల పెంపకం- పరిచయం | 3 |
| 2. | వివిధ జాతుల పందులు | 5 |
| 3. | పందుల ఎంపికలో పాటించవలసిన మెలకువలు | 7 |
| 4. | పంది పిల్లల యాజమాన్యం | 9 |
| 5. | పందుల గృహ వసతి | 12 |
| 6. | పందుల సంతాన ఉత్పత్తిలో మెలకువలు | 14 |
| 7. | పందుల వివిధ దశలలో పోషణ యాజమాన్యం | 16 |
| 8. | పందుల ఆరోగ్య సంరక్షణ | 20 |

# 1. పందుల పెంపకం- పరిచయం

మన దేశంలో పందుల పెంపకం అనాదిగా ఆర్థికంగా వెనుకబడ్డ కొన్ని బలహీనవర్గాల వారు వృత్తిగా చేసుకుంటూ వచ్చారు. ఇటీవల కాలంలో సీమ పందుల మాంసానికి ప్రాముఖ్యత పెరగడంతో, మేలు జాతి పందులను శాస్త్రీయ పద్ధతుల్లో పెంచితే ఎక్కువ లాభాలు వస్తాయని, మంచి ఉపాధి అవకాశం ఉందని చాలా మంది అర్థం చేసుకున్నారు. ఈ కారణంగా, ఇప్పుడు అన్ని వర్గాల వారు శాస్త్రీయ పద్ధతిలో పందుల పెంపకంలో ఆసక్తి చూపిస్తున్నారు. పందుల పెంపకం లాభదాయకమైనదైనా, మన సమాజంలో చిన్నచూపు ఉండటం వల్ల చాలా మంది రైతులు ఈ వృత్తిని చేపట్టేందుకు సంకోచిస్తున్నారు. అంతేకాక, మాంసాహారాన్ని తినేవారిలో కూడా కొంతమంది పంది మాంసం తినేందుకు ఇష్టపడరు. ఇన్ని అడ్డంకులు ఉన్నప్పటికీ, పోషకావశ్యకతలపై ప్రజల్లో వచ్చిన అవగాహనతో పందిమాంసం వాడకం ఇటీవల విపరీతంగా పెరిగింది. తక్కువ ఖర్చుతో అధిక మాంసాన్ని ఉత్పత్తి చేయగల సాధనంగా పందులు ప్రాధాన్యత పొందాయి. మాంసాన్ని ఉత్పత్తి చేసే జంతువులలో పందులు అత్యధిక మాంసాన్ని ఇస్తాయి. ఇటీవల కాలంలో సీమ పందుల మాంసానికి ప్రాముఖ్యత పెరిగింది. మేలు జాతి సీమపందులను శాస్త్రీయపద్ధతిలో పెంచినచో ఎక్కువ లాభసాటిగా వుండి, మంచి ఉపాధిని కలిగిస్తుంది. కనుక ఇప్పుడు అన్ని వర్గాల వారు శాస్త్రీయపద్దతిలో పందుల పెంపకం చేయాలని ఆసక్తి చూపిస్తున్నారు.

## పందుల పెంపకం- ప్రత్యేక లాభాలు

1. పందులు ఒక్కొక్క ఈతకు 8 నుండి 12 పిల్లలు ఈనగలుగుతాయి. సంవత్సరానికి కనీసం రెండు ఈతలు యిస్తాయి.
2. పందులలో పెరుగుదల ఎక్కువ.
3. పందులు తిన్న మేత (దాణా) ని ఎక్కువ సామర్థ్యంతో మాంసంగా మార్చే శక్తిని కలిగివున్నాయి.
4. ప్రతీ 3-4 కిలోల దాణాతో కిలో మాంసం ఉత్పత్తి చేయగలవు గొర్రెలు, మేకలు కంటే మాంసం ఉత్పత్తి సామర్థ్యం పందులలో ఎక్కువ.
5. మన వినియోగానికి ఉపయోగపడని గింజదాన్యాలు, వృధాగా మిగిలిన ఆహారం, మార్కెట్లో మిగిలిన కూరగాయలు, ఆకుకూరలు మొదలైన వాటితో పందులను పెంచవచ్చును.
6. తక్కువ లేబర్ ఖర్చు: పందులను సంరక్షించడానికి లేబర్ మీద అయ్యే ఖర్చు గొర్రెలు, మేకల కంటే తక్కువగా ఉంటుంది.
7. తక్కువ భూమి అవసరం: చాలా తక్కువ స్థలంలోనే పందులను పెంచవచ్చు.
8. తక్కువ పెట్టుబడి: పందుల గృహవసతికి, పరికరాలకు ఎక్కువ పెట్టుబడి అవసరం లేకుండా ప్రారంభించవచ్చు.

9. త్వరగా ఆదాయం: ప్రారంభ పెట్టుబడి తక్కువగా ఉండి, పందులు త్వరగా పెరిగి మార్కెట్కి తక్కువ సమయంలోనే సిద్ధమవుతాయి. 75 నుండి 100 కిలోల బరువు వచ్చే సమయానికి మార్కెట్ చేయవచ్చు.

10. అధిక మాంస ఉత్పత్తి: పందుల శరీర బరువులో 70-80 శాతం మాంసం ఉత్పత్తి అవుతుంది. ఇది గొర్రెలు, మేకల కంటే ఎక్కువ.

11. పౌష్టిక విలువలు: పంది మాంసంలో మాంసకృత్తులు ఎక్కువగా ఉండి, కొవ్వు పదార్థాలు తక్కువగా ఉంటాయి.

12. పంటలకు ఎరువు: పంది పెంట భూములకు సమృద్ధిగా పోషకాలను అందించి మంచి ఎరువుగా ఉపయోగపడుతుంది.

13. వైద్య ఉపయోగాలు: డయాబెటిస్ చికిత్సలో ఇన్సులిన్ తయారీకి, హెపారిన్ ఉత్పత్తికి, మరియు గుండె కవాటాల తయారీలో పందులను ఉపయోగిస్తారు.

## పందుల పెంపకం ప్రారంభించే ముందు గమనించవలసిన విషయాలు:

1. పందులు ఫారం ప్రారంభించే ప్రాంతంలో పందిమాంసం అమ్మకానికి ఎక్కువ గిరాకి వుండాలి.
2. పందుల పెంపకం నుండి ఎక్కువ ఆదాయం రావాలంటే మార్కెటింగ్ చాలా ముఖ్యం.
3. పందులను అమ్ముటవలన ఆదాయం పొందటం కన్నా పందులను వధించి పంది మాంసం అమ్ముటవలన ఎక్కువ ఆదాయం వస్తుంది.
4. ఆరోగ్యమైన యార్క్ షైర్  వంటి సీమ జాతి పందులు లేదా సంకరజాతి సీమపందులను ఎంపిక చేసుకోవాలి.
5. దగ్గరలో హాస్టల్స్, హోటల్స్లో మిగిలిన వృధా ఆహారం, మార్కెట్లో మిగిలిన వృధా కాయగూరలు లభ్యం అయినచో మేత ఖర్చుబాగా తగ్గుతుంది.
6. పందులను తీసుకొనివచ్చేముందు వాటికి మంచి గృహవసతి, పరికరాలు ఏర్పాటు చేసుకోవాలి.
7. దగ్గరలో ఉన్న పందుల ఫారాన్ని సందర్శించి పందుల పెంపకం గురించి అవగాహన ఏర్పరచుకోవాలి.

పందుల పెంపకం సరైన పద్ధతిలో నిర్వహిస్తే తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చు

## 2. వివిధ జాతుల పందులు

పందుల పెంపకం ముఖ్యంగా మాంసం ఉత్పత్తి కోసం చేపడతారు మిగతా పశువులతో పోలిస్తే పందుల యొక్క పెరుగుదల వేగంగా ఉండి ప్రపంచ మానవాళికి కావలసిన ప్రోటీన్ల ఆవశ్యకతను పూరించడంలో ముందున్నది. భారతదేశం ప్రపంచంలో పందుల పెంపకంలో ఐదవ స్థానంలో ఉండగా చైనా మొదటి స్థానంలో ఉంది.

**a) విదేశీ జాతులు:**

చర్మం రంగు ఆధారంగా పందుల యొక్క జాతులను మూడు రకాలుగా విభజించవచ్చు

1. నల్లని జాతులు: పోలాండ్ చైనా, బెర్క్ సైర్, హ్యా ప్ సైర్
2. రంగు జాతులు: టాం వర్త్, డ్యూరాక్, హియర్ ఫోర్డ్
3. తెల్లని జాతులు: లార్జ్ వైట్ యాక్ సైర్, మిడిల్ వైట్ యాక్ సైర్, ల్యాండ్రేస్, చెస్టర్ వైట్

**యార్క్ షైర్ పంది:**


ఇది ఇంగ్లాండ్లో అభివృద్ధి చెందింది. దీనిని దేశవాళి పందులను అభివృద్ధిచేయడానికి మనదేశానికి తీసుకువచ్చారు. ఈ జాతి పందులు పొడవుగా భారీసైజులో వుంటాయి. చర్మం లేత ఎరుపు రంగుతో ముడతలు లేకుండా ఉంటుంది. చెవులు పొడవుగా నిటారుగా వుంటాయి. వివిధ వాతావరణ పరిస్థితులను తట్టుకొని, రోగనిరోధక శక్తి కలిగి వుంటాయి. ఈ జాతి పిల్లలను ఎక్కువగా ఈనుతుంది. మరియు వాటికి కావలసిన పాలునియిచ్చి పెంచగలదు. మంచి పోషణ, గృహవసతి యిచ్చినచో వీటితో పెరుగుదల, మాంసోత్పత్తి ఎక్కువగావుండి పందుల పెంపకం లాభసాటిగా వుంటుంది.

**b) స్వదేశీ జాతులు:**

గుంగరూ, నియాన్ మేఘ, అగొండాగోవన్, తెలియావో, నికోబారి, జోవాక్, మాలి, పూర్ణిమ మొదలగునవి. మన రాష్ట్రంలో జీను, కటకం, వరంగల్లు అనే దేశవాళి జాతి పందులు వున్నవి. వీటిలో ఉత్పాదక శక్తి తక్కువగా వుండి, రోగనిరోధక శక్తి ఎక్కువగా వుంటుంది. అందుచేత వ్యాపారసరళిలో విదేశీ జాతులైన లార్డ్ వైట్ యార్క్ షైర్, ల్యాండ్రేస్, హేంపైర్ మొదలగు సీమ పందులను పెంచాలి. వీటిలో యార్క్ షైర్ సీమ పందిని ఎక్కువగా పెంచుదురు. దేశవాళి పందులను యార్క్ షైర్ సీమపందితో సంకర పరచిసంకరజాతి సీమపందులను పెంచుదురు. ఈ విధంగా అభివృద్ధి పరిచిన బ్రీడు SVVU T-17.

**SVVUT-17 పంది జాతి:**

SVVU T-17 పంది జాతిని ఆంధ్రప్రదేశ్ స్థానిక పరిస్థితులకు అనుకూలంగా ఉండేలా తిరుపతి శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయంలో AICRP ప్రాజెక్ట్ ద్వారా అభివృద్ధి చేశారు. ఈ జాతిలో 75% విదేశీ (ఎగ్జాటిక్) లక్షణాలుమరియు 25% భారతీయ పంది లక్షణాలుమిళితం చేసి ప్రమాణీకరించారు. వేగంగా పెరిగి, తక్కువ ఖర్చుతో ఎక్కువ మాంసాన్ని ఉత్పత్తి చేయగలిగే ఈ జాతి, స్థానిక వాతావరణానికి అనుగుణంగా రోగ నిరోధక శక్తి కలిగి ఉంటుంది. తక్కువ ఖర్చుతో పెంచుకోవడానికి అనువుగా ఉండటంతో రైతులకు అధిక లాభాలను అందిస్తుంది. SVVU T-17 పంది జాతి మాంసకృత్తులు సమృద్ధిగా ఉండి, ఆహార పోషక విలువలు అధికంగా ఉంటాయి.






## 3. పందుల ఎంపికలో పాటించవలసిన మెలకువలు

I. ఉత్తమ లక్షణాలు కలిగిన మంచి జాతి పంతులను ఎంచుకోవాలి

ii. శరీరం పొడవుగా, దృఢంగా, పుష్టిగా ఉండి త్వరగా పెరిగే వాటిని ముఖ్యంగా పునరుత్పత్తి సామర్థ్యం అధికంగా కలవారిని ఎంపిక చేసుకోవడం మంచిది.

iii. ముందు భాగం సన్నగాను వెనుక భాగం లావుగాను ఉండవలెను

iv. మెడ చిన్నదిగా ఉండి తొడలు నిండుగా మాంసంతో ఉండవలెను

v. పక్కలు లోతుగా ఉండి కాళ్లు పాదములో ఎముకపుష్టితో సన్నగా దృఢంగా ఉండవలెను

vi. ఎటువంటి వ్యాధులు అంగవైకల్యం లేకుండా చూసుకోవాలి

vii. కొత్త పందులను మందలోకి ప్రవేశించబెట్టేటప్పుడు రక్త పరీక్షలు నిర్వహించి బ్రుసెల్లోసిస్ లెప్టొస్పిరొసిస్ వంటి వ్యాధులను లేకుండా నిర్ధారించుకోవాలి


viii. మన వాతావరణ పరిస్థితులు తట్టుకునే విధంగా ఉండాలి.

ix. విత్తనపు పందుల తల్లిదండ్రుల పూర్వ చరిత్రలు పరిగణలోకి తీసుకోవాలి. ఎందుకంటే మంచి లక్షణాల తల్లిదండ్రుల నుంచి మంచి పిల్లల సంక్రమిస్తాయి.

x. ఆహారాన్ని మాంసం గా మార్చే సమస్త ఎక్కువగా ఉండాలి ఎందుకంటే 80 శాతం వరకు ఖర్చు దానాకు, ఆహారానికి పెట్టవలసి ఉంటుంది.

### విత్తనపు పంది ఎంపిక:

విత్తనపు పంది ఎంపిక చాలా కీలకమైంది ఎందుకనగా ఒక మగ పందిని 10 ఆడ పందులతో క్రాసింగ్ చేస్తారు. పునరుత్పత్తి సామర్థ్యం అధికంగా కల లోపాలు లేనటువంటి శరీర సౌష్టవం కలిగిన చలాకీగా ఉన్న విత్తనపు మగ పందిని క్రాసింగ్ కోసం వినియోగించుకోవాలి విత్తనపు పంది కాళ్లు బలంగా ఉండే విధంగా చూసుకోవాలి. వెనక భాగం పలుచగా ఉండాలి. విత్తనపు పంది ఎనిమిది నుంచి పది నెలల వయసు ఉన్నదానిని ఎంపిక చేసుకోవడం ఉత్తమం



## ఆడ పందుల ఎంపిక:

ఆడ పందులు ఎంపిక చేసుకునేటప్పుడు కనీసం 12 మూలాధార చనములు ఉండి శరీర భాగం విశాలంగా ఉండాలి. ఈ లక్షణం ఆడ పందులకు తండ్రి నుంచి సంక్రమిస్తుంది. విత్తనపు మగ పందిని బయట నుంచి తెచ్చుకునేటప్పుడు ఎటువంటి జబ్బులు పరాన జీవులు లేకుండా నిర్ధారణ చేసుకోవాలి. సంతాన ఉత్పత్తి కోసం ఎంపిక చేసుకునే ఆడ పందులను శరీర బరువు వయసు పరిరక్షణలోకి తీసుకొని ఎంపిక చేసుకోవాలి. ఆడ పంది వయసు 8 నెలలు దాటి 80 కేజీల బరువు పైన ఉన్నది రెడీ టు క్రాస్, అనగా పునరుత్పత్తికి సిద్ధంగా ఉన్న వాటిని ఎంపిక చేసుకోవాలి. ఇరుకైన పాలధార లేకుండా వాటి చనుమములు విశాలంగా ఉండి 12 నుండి 14 చలమొమ్ములు కలిగినవి ఎంపిక చేసుకోవాలి. ఈనిల ఆడ పందిని ఎంపిక చేసుకున్నప్పుడు గత చరిత్రను పరిగణం తీసుకోవాలి అనగా పుట్టిన పిల్లల సంఖ్య పిల్లల పెరుగుదల వాటిలో మరణాల శాతం తిరిగి క్రాసింగ్ కి వచ్చిన సమయం వంటి విషయాలు పరిగణలోకి తీసుకోవాలి. ఎక్కువ కొవ్వు పట్టి ఉండకూడదు. గర్భస్రావం చరిత్ర కలిగిన ఆడ పందులను ఎంచుకోరాదు.

## క్రాసింగ్ ఎప్పుడు చేయాలి:

సాధారణంగా ఆడ పందులు 240 నుంచి 270 రోజుల వయసు మధ్యలో మొదటిసారి ఎదకు వస్తాయి. ఎదుకు వచ్చిన వెంటనే అండాల విడుదల తక్కువ సంఖ్యలో ఉండడం వలన ఒకటి లేదా రెండు ఎదలను వదిలేసి తర్వాత ఎదకు వచ్చినప్పుడు మగ పందితో క్రాసింగ్ జరిపించాలి దీని ద్వారా ఎక్కువ పిల్లల పొందడానికి అవకాశం ఉంటుంది. ఎదలోకి వచ్చిన పంది రెండు నుండి మూడు రోజుల పాటు మగ పందిని దాటడానికి అనుమతిస్తుంది. అయితే అండాల విడుదల మరియు ఫలదీకరణం అనేది రెండవ రోజు మగ పందిని దాటించడం వలన ఉత్తమంగా ఉంటుంది పంది పిల్లల సంఖ్య ఈతలతో పాటు పెరుగుతూ ఉండడని గమనించవచ్చు 10 నుండి 12 ఈతలు ఈనెల పందిని మంద నుంచి వేరు చేయాలి ఇన్ బ్రీడింగ్ డిప్రెషన్ అనేది జన్యుపరంగా లోపాలకు దారితీస్తుంది కావున ఆడ మగ పందులు రక్తసంబంధీకులుగా లేకుండా చూసుకోవాలి దీనికోసం మందలో మగ పందిని తరచుగా మార్చుకుంటూ ఉండాలి ఇన్ బ్రీడింగ్ వలన వచ్చిన పిల్లలలో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే మరణాల శాతం మరియు వ్యాధుల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది ఈ పైన సూచించిన విషయాలను పరిగణలోకి తీసుకొని క్రాసింగ్ కి చేసుకోవచ్చు

## 4. పంది పిల్లల యాజమాన్యం

పందిపిల్లలు పుట్టిన సమయం నుండి తల్లి నుండి వేరు చేసే సమయంలో సుమారుగా 10 నుంచి 15% వరకు మరణాలు సంభవిస్తూ ఉంటాయి. ఇవి ఎక్కువగా మొదటి నాలుగు రోజుల్లోనే సంభవిస్తుంటాయి. జీర్ణకోశ వ్యాధులు, పారుడు, రక్తహీనత, తల్లికింద పడి నలిగిపోవడం, విత్తలలు నొక్కుకున్నప్పుడు సంభవించు వరిబీజము వంటి కారణాల వలన పందిపిల్లలు ఎక్కువగా మరణిస్తూ ఉంటాయి. పంది పిల్లల మరణాలను అరికట్టడాన్ని బట్టి లాభాలు అర్జించడం అనే అంశం ఆధారపడుతుంది. దీనికోసం పంది ఈనడానికి ముందు, ఈనిన తరువాత మరియు పిల్లల సంరక్షణలో కొన్ని జాగ్రత్తలు పాటించవలసి ఉంటుంది

### ఈనిన తర్వాత తీసుకోవలసిన జాగ్రత్తలు :

- పుట్టిన రోజు నుంచి నాలుగవ రోజు వరకు పంది ఈనే సమయంలో ఒక సహాయకుడు లేదా పందియజమాని దానిని కనిపెట్టుకొని ఉండాలి.
- పంది పిల్లలు పుట్టిన వెంటనే వాటి యొక్క నోట్లో మరియు రంధ్రంలో ఉంటే మ్యూకస్ను తొలగించాలి. పందిపిల్లను శుభ్రమైన గుడ్డతో తుడవాలి.
- పుట్టిన వెంటనే బొట్టును కత్తిరించి టీచర్ అయోడిన్ ను అద్దవలెను. దీని వలన బొడ్డు వాపు వ్యాధి రాకుండా నివారించవచ్చు.
- చలి ఎక్కువగా ఉండే ప్రదేశంలో పంది పిల్లల సంరక్షణకై బ్రూడింగ్ లైటు ఏర్పాటు చేసుకోవాలి. తల్లికి దగ్గరగా ఉండేటట్లు చూసుకోవాలి, దీని ద్వారా తల్లి యొక్క పొట్ట భాగం నుండి ఉష్ణోగ్రత అనేది పిల్లలకు లభిస్తుంది
- ఈనిన వెంటనే పిల్లలు జున్నుపాలు త్రాగేటట్లుగా చూసుకోవాలి. పిల్లలు నీరసంగా ఉండి తల్లి నుండి తాగలేని పక్షంలో తల్లి జున్నుపాలు బాటిల్లో సేకరించి పిల్లలకు పట్టాలి. 100 నుంచి ఈ 250 mL జున్నుపాలు మాత్రమే పంది నుండి సేకరించాలి ప్రతి రెండు నుంచి మూడు గంటలకు ఒకసారి పాలు తాగేటట్లు చూసుకోవాలి.



## 4 నుంచి 14 రోజులలో పంది పిల్లల సంరక్షణ:

పంది పిల్లలకు ఎనిమిది పదునైన కోర పళ్ళు పుట్టుకలోనే కలుగుతాయి. పిల్లలు పుట్టిన నాలుగవ రోజున నీడిల్ టీత్ కట్టర్ తోటి ఆ పళ్ళను కత్తిరించుకోవాలి. లేనిచో ఇవి తల్లి చనుమోములను కొరకడం వలన తల్లికి పుండ్లు పడుట లేక పిల్లలు ఒకదాని ఒకటి గాయపరచుకొనడం అనేది జరుగుతుంది.

## విత్తులు తీసివేయడం (Castration):

పుట్టిన మగ పందులలో త్వరితంగా శరీర బరువు పెరగడానికి ఈ ప్రక్రియను అవలంబిస్తారు. ఈ ప్రక్రియను 14 నుంచి 20 రోజుల మధ్యలో చేసుకోవచ్చు. మాంసం కొరకు పెంచే పందులలో మాత్రమే ఈ ప్రక్రియ చేసుకోవాలి. విత్తులు తీసి వేసిన ప్రదేశంలో ఇన్ఫెక్షన్ రాకుండా టీచర్ అద్దుకోవాలి.



పందులను గుర్తించుట (చెవులకు గుర్తులు పెట్టుట)



కోర పళ్ళు కత్తిరించుట

## ఐరన్ ఇంజక్షన్లు:

తల్లి పంది యొక్క జున్నుపాలలో ఐరన్ అనే ఖనిజం తక్కువ మోతాదులో ఉండడం వలన అది మనము కృత్రిమంగా అందించవలసి ఉంటుంది. లేనిచో ఇది రక్తహీనతకు తద్వారా పందిపిల్లలో మరణాలకు కారణమవుతుంది. దీనికోసం పుట్టిన నాలుగవ మరియు 14వ రోజున ఒక మిల్లీలీటరు చొప్పున ఐరన్ ఇంజక్షన్లను చర్మం కింద ఇవ్వవచ్చు లేదా ఐరన్ పేస్టు ను తల్లి యొక్క చనుమములకు పూసిన యెడల పిల్లలకు కావలసిన ఐరన్ అనేది అందుతుంది.

## పంది పిల్లలలో నట్టల మందులు:

పంది పిల్లలలో బాహ్య అంతర పరన్న జీవులు, ఎలిక పాములు పెరుగుదలను, రోగ నిరోధక శక్తిని దెబ్బతీస్తాయి, మరియు పౌష్టిక లోపాలను కలిగిస్తాయి. దీనిని నివారించదానికి క్రమం తప్పకుండ నట్టల నివారణ మందులు త్రాగించలి. పిల్లలు 2-4 వారాల వయస్సులో మొదటి సారి నట్టల నివారణ మందులు ఇవ్వాలి. 8 వారాల వయస్సులో మళ్లీ ఇవ్వాలి. ఆ తరువాత ప్రతి 6-8 వారాలకు ఒకసారి ఇవ్వాలి.

## పందులను గుర్తించుట (చెవులకు గుర్తులు పెట్టుట):

పంది చెవులకు 'V ' ఆకారంలో గుర్తులు నిర్ణీత ప్రదేశాలలో పెట్టుట ద్వారా పందులను సులువుగా గుర్తించవచ్చును. దీని వలన పందుల యాజమాన్యం మరియు రికార్డుల నిర్వాహణ సులభతరం అవుతుంది.

## తల్లి నుండి పిల్లలను వేరు చేయడం:

సాధారణంగా ఎనిమిది వారాల వయసులో పిల్లలను తల్లి నుండి వేరు చేస్తారు. అయితే పాలు పుష్కలంగా ఉండి క్రీపుదానాకు అలవాటు పడిన పంది పిల్లలను శరీర బరువును బట్టి 28వ రోజు నుంచి తల్లి నుండి వేరు చేయవచ్చు. దీని ద్వారా మందలో చిన్నగా ఉన్నటువంటి పంది పిల్లలకు పాలు అందేటట్లు చూసుకోవచ్చు. ఈ విధంగా చేయడం వలన తల్లి పంది త్వరితంగా తర్వాత ఎదిలోనికి రావడానికి అవకాశం ఉంటుంది. క్రీప్ ఫీడ్ పంది పిల్లలు తినడానికి వీలుగా గదిలో ఒక మూలభాగాన్ని కేటాయించాలి. అందులో పిల్లలకి మాత్రమే రాకపోకలకు వీలు ఉండేటట్లు చూసుకోవాలి. 24% ప్రోటీన్లు ఉండేటువంటి నాణ్యమైన క్రీపుదానా ఈ క్రీపు గదిలో వేయడం ద్వారా పంది పిల్లలు దానాకు త్వరగా అలవాటు పడతాయి.

## 5. పందుల గృహ వసతి

పందుల పెరుగుదల మరియు ఆరోగ్యం వాటికి కల్పించే గృహ వివసతి పైనే ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. కావున గృహ వసతుని కల్పించడంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

i పందుల గృహము ఎత్తైన స్థలంలో మరియు పొడిగా ఉండే ప్రదేశంలో నిర్మించాలి.

ii పందుల గృహములో మరియు చుట్టూ నీరు నిలువ లేకుండా చూసుకోవాలి.

iii నివాస ప్రాంతానికి దూరంగా ఉండునట్లుగా జాగ్రత్త తీసుకోవాలి. షెడ్డు లోకి గాలి వెలుతురు ధారాళంగా ఉండేటట్లు చూడాలి. గోడలకు తేమ రాకుండా ప్లాస్టరింగ్ చేసుకోవాలి. నీరు నిలిచే విధంగా మరియు గరుకుగా నేల అనేది ఉండకూడదు. ప్రతి పంది సులభంగా తిరుగుటకు విశాలమైన ప్రదేశము ఉండవలెను.

iv చూలు ఉన్న పందులకు, పాలిచ్చే ఆడ పందులకు, మగ పందులకు మరియు మిగిలిన పందులకు వేరువేరు గదులు కేటాయించే విధంగా షెడ్డు భాగాలు నిర్మించుకోవాలి.

v చుట్టుపక్కన నీడ ఉండునట్లు చెట్లు నాటుకోవాలి. ప్రతి పందికి ఎల్ల వేళలా నీరు అందుబాటులో ఉండాలి. దీనికోసం నిపుల్ డ్రింకర్స్ లేదా నీటితొట్లను ఏర్పాటు చేసుకోవాలి.

vi ప్రతి పందికి దానా తొట్టె 6 నుండి 12 అంగుళాలు ఉండేటట్లు చూసుకోవాలి. ఫ్లోరింగ్ నున్నగా కాకుండా స్వల్పంగా గరుకుగా ఉండేటట్లు చూసుకోవాలి.

vii మురుగు నీరు సులభంగా పోవుటకు ఫ్లోరింగ్ ఏటవాట్లుగా ఉండేటట్లు చూడాలి. ఘట్టర్ కాలువభాగం 10 నుంచి 15 సెంటీమీటర్ల వెడల్పు ఎనిమిది సెంటీమీటర్లు లోతు ఉండాలి.

viii గృహ నిర్మాణంలో పక్క గోడలు నాలుగు నుంచి ఐదు అడుగులు ఎత్తు వరకు కట్టి ఆ పై భాగము GI పైపులతో కానీ, కర్రలతో కానీ నిర్మించాలి.

ix పై కప్పు 8 నుంచి 10 అడుగుల ఎత్తులో ఉండాలి.

### పందుల కోసం నేల స్థల అవసరాలు:

I పిల్లలు (వీడేనప్పుడు): ఒక్కొక్క పిల్లకు 0.3-0.5 చదరపు మీటర్లు.


ii పెరుగుతున్న పిల్లలు: ఒక్కొక్కదానికి 0.75-1.0 చదరపు మీటర్లు.

iii పెద్ద పందులు (తల్లి పందులు): ఒక్కొక్క తల్లి పందుకు 1.5-2.0 చదరపు మీటర్లు.

iv పందిరి పందులు (తల్లి పందులు పిల్లలతో కలిపి): కనీసం 4-6 చదరపు మీటర్లు అవసరం.

| పందుల రకము | కావలసిన నేల (చదరపు మీటర్లలో ఒక్కొక్కటికీ) | | షెడ్డులో పందుల గరిష్ట సంఖ్య |
|---|---|---|---|
| | కప్పు ఉన్న విస్తీర్ణం | కప్పు లేని విస్తీర్ణం | |
| మగ పంది | 6.0-7.0 | 8.8-12.0 | ఒకటి మాత్రమే |
| ఈనే పంది | 7.0-9.0 | 8.8-12.0 | ఒకటి మాత్రమే |
| మూడు నుంచి ఐదు నెలల పందులకు | 0.9-1.2 | 0.9-1.2 | 30 |
| ఐదు నెలల పైబడిన పందులకు | 1.3-1.8 | 1.3-1.8 | 30 |
| వట్టిపోయిన పందులకు | 1.8-2.7 | 1.4-1.8 | 3-10 |

ఇంచుపించు ఎనిమిది అడుగుల పొడవు ఎనిమిది అడుగులు వెడల్పు గల గదిలో నాలుగు పెద్ద పందులను ఉంచవచ్చు. అంతే విస్తీర్ణం గదికి బయట కప్పు లేని విస్తీర్ణం ఉండాలి. ఒకే పై కప్పు కింద ఒకవైపు 8 గదుల మధ్యలో 4 అడుగుల స్థలము ఉంచి ఎదురుగా 8 గదులు నిర్మించుకోవచ్చు. ఈనే పందుల గదిలో పంది పిల్లల కోసం క్రీపు గదిని ఏర్పాటు చేసుకోవాలి




## పందుల గృహ వసతి లేఔట్

## 6. పందుల సంతాన ఉత్పత్తిలో మెలకువలు

సంతాన ఉత్పత్తికి తొలిచూలు ఆడ పందులు సుమారు 90 కిలోల బరువు తూగేది ఎంపిక చేసుకోవాలి. ఎక్కువసార్లు క్రమంగా, మరియు ఎక్కువ పిల్లలను పెట్టిన సంతతి నుండి తీసుకోవాలి. తక్కువ సమయంలో మార్కెట్ చేరినవి అనగా అధిక బరువు వచ్చే పందులను మార్కెట్కు కావలసిన రకానికి చెందినవి ఉండాలి. రోజువారి బరువు పెరుగుదలలో మేత వినియోగ సామర్ధ్యం బాగా ఉండాలి. ఎంపిక చేసుకునే మగ పంది తల్లి వరుసగా ఎన్నోసార్లు ఈని ఎక్కువ పిల్లల ఎక్కువ సంఖ్యలో పిల్లలు పెట్టినది అయ్యి ఉండాలి.

### ఆడ పంది ఈనడానికి పరిగణలోకి తీసుకోవలసిన అంశాలు :

| | |
|---|---|
| ఆడ పంది ఈనే వయస్సు | 8 నెలలు |
| చూడి పంది బరువు | 100 నుంచి 200 కిలోలు |
| ఈనడానికి పట్టే సమయం | తొలిచూలు పంది – మొదటిరోజు<br>మలిచూలు పంది – రెండవ రోజు |
| గర్భధారణ సమయం | 114 రోజులు |
| రుతు చక్రం | 21 రోజులు |

### చూడి పందులలో తీసుకోవలసిన జాగ్రత్తలు:

ఆడ పందుల గర్భాధారణ సమయం 19 నుంచి 120 రోజులు వరకు ఉంటుంది సగటు 114 రోజుల గర్భధారణ సమయంలో చూడి పందిని ఒంటరిగా ఒక గదిలో ఉంచాలి లేకపోతే అవి మిగిలిన పందులతో గొడవ పడడం వల్ల గర్భాసరావం అవుతుంది ఒక్కొక్క ఆడ పందికి సుమారు మూడు పీటర్ల విస్తీర్ణం కల స్థలం ఉండడం మేలు చూడు పందులను ప్రతి రోజు ఉదయం వేళ ఆరు బయట దాని పొలంలో కానీ తిరగనివ్వడం మంచిది. ఈనేటప్పుడు జాగ్రత్త



## వీనింగ్ (తల్లిపాల నుంచి వేరు చేయడం) & తదనంతర సంరక్షణ:

i Early Weaning: తల్లిపాలనుండి పిల్లలను తొందరగా వేరు చేయడం వల్ల ఆడ పంది త్వరగా మరో మూడిలోకి (Heat Cycle) రావడానికి అవకాశం ఉంటుంది.

ii వీనింగ్ తర్వాత పంది పోషణ: పిల్లలని వేరు చేసిన తర్వాత, ఆడ పందికి శరీర శక్తిని పునరుద్ధరించడానికి ప్రత్యేకమైన పునరుజ్జీవన ఆహారం (Restoration Diet) అందించాలి.

iii వీనింగ్ తర్వాత క్రాసింగ్: పిల్లల్ని వేరు చేసిన 30-40 రోజుల లోపు ఆడ పందిని వేడి లక్షణాల కోసం గమనించి, సరిగా సమయానికి క్రాసింగ్ జరపాలి.

iv లాభదాయకమైన పంది పెంపకానికి సంవత్సరానికి రెండుసార్లు పందులను క్రాసింగ్ చేయడం మంచిది.

v సరైన జాతి ఎంపిక, గర్భధారణ సమయంలో శ్రద్ధ, ఈనేటప్పుడు సరైన జాగ్రత్తలు పాటించడం వల్ల పందుల సంతానోత్పత్తి మెరుగవుతుంది, అధిక లాభాలు పొందే అవకాశం ఉంటుంది.



## 7. పందుల వివిధ దశలలో పోషణ యాజమాన్యం

సాధారణంగా పందుల పెంపకంలో మేత ఖర్చుఅనేది పెంపక ఖర్చులో 70-75% వరకు ఉంటుంది. పందుల పెంపకంలో ఆహార నిర్వహణ చాలా ముఖ్యం, ఎందుకంటే ఆహారం పందుల ఆరోగ్యం, పెరుగుదల, ఉత్పాదకత మరియు లాభాలను ప్రభావితం చేస్తుంది. పందులు వివిధ దశల్లో వేరువేరు ఆహార అవసరాలను కలిగి ఉంటాయి. ప్రతి దశలో సరైన ఆహారం అందించడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చు. సరియైన దాణా మిశ్రమాన్ని ఎన్నుకోవాలి. అందుకు పంది యొక్క వయస్సుని మరియు బరువును కూడా పరిగణలోనికి తీసుకోవాలి. పంది యొక్క శరీర ధర్మ అవసరాన్ని బట్టి దానికి కావలసిన మాంసకృత్తుల శాతాన్ని నిర్ణయించుకోవాలి.

### పందుల దాణా ఎలా ఉండాలి...???

- ఋతువులను బట్టి చవకగా లభించే పదార్థములతో మిశ్రమ దాణా తయారు చేసుకోవాలి.
- మిశ్రమ దాణాలో కనీసము 6 పాళ్ళు పీచు పదార్థము, 5 పాళ్ళు కొవ్వు పదార్థము, 14-20 పాళ్ళు మాంసకృత్తులు, 2-3 పాళ్ళు లవణ మిశ్రమము ఉండునట్లు కలుపుకోవాలి.
- దాణాలో విటమిన్లు మరియు లవణములు సరియైన పాళ్ళలో వుండాలి.
- పంది పిల్లలకిచ్చే దాణాలో మంచి పోషక పదార్థములు ఉండాలి.
- చూడి పందికి దాని బరువుని బట్టి సరియైన పాళ్ళలో మిశ్రమ దాణా అందునట్లు చూడాలి.
- ఈనిన తరువాత ఆడపంది వయస్సు, సైజు, బరువు మరియు పుట్టిన పిల్లల సంఖ్యను బట్టి దాణా అందించాలి.
- హోటల్లో మరియు ఇంట్లో మిగిలిన వృధా ఆహారము, కూరగాయల మార్కెట్లో మిగిలిన వ్యర్ధపదార్ధములు దాణాలో వాడుకొని దాణా ఖర్చు తగ్గించుకోవాలి.

### మిశ్రమ దాణాను కలుపుటకు కావలసిన పదార్థములు :

- సీరియల్సు (గింజలు) - బియ్యపునూక, గోధుమనూక, జొన్న, మొక్కజొన్న, సజ్జ
- నూనె చెక్కలు - వేరుశనగ చెక్క కొబ్బరిచెక్క నువ్వు చెక్క సోయాపిండి మొదలగునవి
- తవుడు- బియ్యపు తవుడు, గోధుమ తవుడు
- ఇతర పదార్థాలు- బెల్లపు మడ్డి, పండ్ల కూరగాయల వ్యర్థాలు, చింతపిక్కలు, మామిడి జీళ్ళు, హోటల్ వెస్ట్ బంగాళదుంపలు, మామిడి తోక్కలు మొదలగునవి

- పందుల మేతల్లో మేలు రకపు పశుగ్రాసాలు (పచ్చవి) చిన్న ముక్కలుగా కత్తిరించి వాడటం వలన ఖర్చును తగ్గించు కొనవచ్చును.
- లూసర్న్, బొబ్బర, మొక్కజొన్న, జొన్న మొదలగు పశుగ్రాసాలు లేతగా ఉన్నప్పుడు మేత కొరకు వాడుకొనవచ్చును.

## 1. పందిపిల్లల ఆహారం:

పందిపిల్లలు పుట్టిన తర్వాత మొదటి 2 వారాల పాటు తల్లి పాలపై ఆధారపడతారు. ఆ తర్వాత, 2 వారాల వయస్సు నుండి పలు ఆహారాన్ని (క్రీప్ ఫీడ్) ఇవ్వడం ప్రారంభించాలి. ఈ సమయంలో పిల్లల పెరుగుదల చాలా వేగంగా ఉంటుంది, కాబట్టి ప్రోటీన్ ఎక్కువగా ఉన్న ఆహారం (22-24% ప్రోటీన్) ఇవ్వడం చాలా ముఖ్యం. మొదటి 8 వారాల వరకు పందిపిల్లలకు తల్లి పాలతో పాటు పలు ఆహారం కూడా అందించాలి, తద్వారా పిల్లల ఆరోగ్యకరమైన పెరుగుదల జరిగిపోతుంది. ఆహారంలో సరైన శక్తి, ఖనిజాలు, విటమిన్లు ఉండడం అవసరం.

## 2. పెరుగుతున్న పందులు (గ్రోవర్ పిగ్స్):

పెరుగుతున్న పందుల వయస్సు 8 వారాల తర్వాత 6-7 నెలల వరకు ఉంటుంది. ఈ సమయంలో పందుల వృద్ధి వేగంగా జరుగుతుంది, అందువల్ల వారికి ప్రోటీన్ అధికంగా ఉన్న ఆహారం (18-20% ప్రోటీన్) అవసరం. ఇక్కడ పశు సంరక్షణలో పాడి పంటలు, ధాన్యాలు, పంటల అవశిష్టాలు, కూరగాయలు వంటివి ఉపయోగించి తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు అందించే ఆహారం ఇవ్వాలి. పందుల పెరుగుదల బాగా జరగడానికి, రోజుకు 2-3 సార్లు సమంగా ఆహారం అందించడం ముఖ్యం.

| వయస్సు | బరువు(కిలోలు) | దాణా పరిమాణం (రోజుకు) |
|---|---|---|
| 10-30 రోజులు | 3-5 | 50-250గ్రాములు |
| 1-2 నెలలు | 10-15 | 0.5 కిలో |
| 2-3 నెలలు | 25 | 1కిలో |
| 3-4నెలలు | 40 | 1.25 కిలో |
| 4-5 నెలలు | 50 | 1.5 కిలో |
| 5-6నెలలు | 0 | 2.0కిలో |

### 3. గర్భవతులు (ప్రెగ్నెంట్ పిగ్స్):

గర్భధారణ సమయంలో పందుల ఆహారం ప్రత్యేకంగా ఉండాలి. గర్భవతుల కోసం ఎక్కువ ప్రోటీన్, ఖనిజాలు, విటమిన్లు ఉండే ఆహారం ఇవ్వాలి, తద్వారా బిడ్డల ఆరోగ్యకరమైన వృద్ధి జరుగుతుంది. ఈ సమయంలో బరువు పెరగకుండా సమతుల ఆహారం ఇవ్వడం అవసరం. సంతానోత్పత్తి కోసం ఈతలకు 1 నెల ముందు మరియు తరువాత శక్తివంతమైన ఆహారం ఇవ్వడం ముఖ్యం. దీని వల్ల పంది సంతానం ఆరోగ్యవంతంగా, శక్తివంతంగా జన్మిస్తుంది.

### 4. పాలను ఇస్తున్న పందులు (లాక్టేటింగ్ పిగ్స్):

పాలి పందుల ఆహారం చాలా ముఖ్యమైనది. ఈ సమయంలో పంది తల్లి, ఎక్కువ పాలు ఉత్పత్తి చేయడానికి అధిక శక్తి మరియు ప్రోటీన్ అవసరం. 18-20% ప్రోటీన్ మరియు ఎక్కువ కేలరీలు ఉండే ఆహారం ఇచ్చే వరకు పాలి ఉత్పత్తి మెరుగవుతుంది. ఈనిన రోజున కాచి చల్లార్చిన నీరు యిచ్చిన చాలును.

తదుపరి 2 లేక 3 రోజుల వరకు సులభముగా జీర్ణమగు పదార్ధములు యివ్వవలయును. ఈనిన 3 వ రోజు నుండి క్రమముగా మిశ్రమ దాణాను యివ్వవలయును. తల్లి పందికి యిచ్చు 3 కిలోలు గాక, ఒక్కొక్క పిల్లకు 250 గ్రాములు చొప్పున అదనముగా తల్లికి యివ్వవలయును. అలాగే, పందికి ఎక్కువ నీరు అందించడం ముఖ్యం, ఎందుకంటే పాలు ఉత్పత్తి చేసేటప్పుడు ఎక్కువ నీటి అవసరం ఉంటుంది. పాలు పండించిన తర్వాత ఆహారం సమర్థంగా ఇవ్వడం వలన, పంది తల్లి యొక్క ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. పాడి పందికి రోజుకి రెండు పర్యాయములు బదులుగా 3-4 పర్యాయములు దాణా యిచ్చిన మంచిది.

### 5. సంతానోత్పత్తి పందులు (బ్రీడింగ్ పిగ్స్):

సంతానోత్పత్తి కోసం ఉపయోగించే పందులు, వీటికి శక్తి, ఖనిజాలు మరియు విటమిన్లు సమపాళ్లలో ఉన్న ఆహారం ఇవ్వాలి. ఈ పందుల బరువు పెరగకుండా చూసుకోవాలి, ఎందుకంటే అధిక బరువులు ఉత్పత్తికి ప్రతికూలంగా ప్రభావితం చేయవచ్చు. మంచి ఫర్టిలిటీ సాధించేందుకు, సరైన పోషకాలు 16-18% ప్రోటీన్ కలిగిన ఆహారాన్ని ఇవ్వడం ద్వారా పందుల ఉత్పత్తి మెరుగుపడుతుంది.

### 6. మాంసం కొసం పెంచే పందులు (ఫ్యాటనింగ్ పిగ్స్):

మాంసం కొసం పెంచే పందులు శరీర బరువును వేగంగా పెంచే ఉద్దేశ్యంతో పెంచబడతాయి. ఈ పందులకు అధిక శక్తి మరియు కొవ్వు ఉండే ఆహారం అవసరం. 14-16% ప్రోటీన్ కలిగిన ఆహారంతో, పందులు వేగంగా బరువు పెరుగుతాయి. తక్కువ ఖర్చుతో ఎక్కువ బరువు పెరిగే ఈ పందులను, శరీర ద్రవ్య మార్పిడి శక్తి ఉన్న ఆహారంతో పెంచాలి.

### 7. వట్టి పందులకు, మగ పందికి:

పంది సైజు బరువును బట్టి రోజుకు 2-3 కిలోల మిశ్రమ దాణా (14% ప్రోటీన్) ఇవ్వవలయును. ఎక్కువగా మేపినచో క్రొవ్వు పట్టి ఉత్పత్తికి పనికిరావు.

## పందులలో వివిధ దశల దానా తయారీ పట్టిక

| దాన దినుసులు | స్టార్టర్ ఫీడ్ | గ్రోయర్ ఫీడ్ | పెద్ద పందుల దాన | చూడి/ పాలిచ్చే పందుల దాన |
|---|---|---|---|---|
| మొక్కజొన్న/జొన్న /సజ్జ | 57 | 54 | 50 | 55 |
| వేరుశెనగ చెక్క/ సోయాపిండి | 23 | 24 | 18 | 19 |
| చేపల పొడి | 7 | - | - | - |
| తవుడు | 7 | 17.5 | 27.5 | 22 |
| ఆయిల్ | 3 | 1.5 | 1.5 | 2 |
| ఉప్పు | 1 | 1 | 1 | 1 |
| ఖనిజలవణాల మిశ్రమం | 2 | 2 | 2 | 2 |
| విటమిన్ మిశ్రమం | 25 gm | 25 gm | 25 gm | 25 gm |
| ప్రోటీన్ % | 23 | 18 | 16 | 18 |

**గమనిక:** ప్రతి దశలో పందులకు సరైన నీటిని పుష్కలంగా అందించడం చాలా ముఖ్యం. సమతుల ఆహారం మరియు తగిన పోషకాలను ఇచ్చే పందులు ఆరోగ్యంగా పెరిగి, అధిక ఉత్పత్తి సాధిస్తాయి.

# 8. పందుల ఆరోగ్య సంరక్షణ

పందుల పెంపకంలో లాభాలు అనేవి పంది పిల్లలకు పెద్ద పందులకు వచ్చి వివిధ రకాల ఆరోగ్య సమస్యల మీద ఆధారపడి ఉంటుంది. పందులలో రకరకాల సూక్ష్మజీవులు మరియు అంతర్పరాన్న జీవుల నివారించడం అనేది క్రమం తప్పకుండా వాక్సినేషన్ మరియు నటల నివారణ మందు తాగించడం పైన ఆధారపడి ఉంటుంది.

1. పరాన్న జీవులు

i) బాహ్యపరాన్న జీవులు:

బాహ్యపరాన్న జీవులలో గోమార్లు విన్ననలు విడుదలు గజ్జి పేలు మొదలగునవి చెప్పుకోవచ్చు ఇది పందుల శరీరంపై స్థావరం ఏర్పరచుకుని రక్తాన్ని పిలిచి రక్తహీనతకు గురి చేయడంతో పాటు కొన్నిరకాల ఇన్ఫెక్షన్ల వాహకాలు కూడా పనిచేస్తాయి. ఈ వ్యాధులు నివారించడానికి క్రమం తప్పకుండా రైతులు నట్టల నివారణ మందులు తాగించుకుంటూ వాక్సినేషన్ వేయించుకోవాలి.

ii) అంతరపరాన్న జీవులు

అంతరపరాన్న జీవులలో ముఖ్యంగా ఏలిక పాములు జలకలు బద్దె పురుగులు మొదలగునవి. ఇది పందుల పొట్ట లొ వివిధ అవయవాలలో స్థావరం ఏర్పాటు చేసుకొని రక్తాన్ని పిలిచి రక్తహీనతను, బలహీనతను కలుగజేస్తాయి.

1. సూక్ష్మజీవులు

a) బ్యాక్టీరియా ద్వారా సంక్రమించే వ్యాధులు

- నిమోనిక్ పాశ్చర్యలోసిస్
- బ్రూసెల్లొసిస్
- లిస్టెరిఒసిస్
- ట్యుబర్కులొసిస్
- సిస్టీ సర్ క్రోసిస్
- కోలీ బ్యాసిల్లోసిస్
- సాల్మొనెల్లొసిస్

b) వైరస్ ద్వారా సంక్రమించే వ్యాధులు

- క్లాసిక్స్ ఫైల్ ఫీవర్ (CSF)
- గాలికుంటు వ్యాధి (FMD)
- ఆఫ్రికన్ స్వైన్ ఫీవర్ (AFS)
- -వేస్కులర్ ఎగ్జిమా ఎక్సమ్తీమా

# పందులలో జూనోటిక్ వ్యాధులు మరియు నివారణ చర్యలు

జూనోటిక్ వ్యాధులు అంటే జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు వ్యాపించే వ్యాధులు. ఇవి ప్రధానంగా బాక్టీరియా, వైరస్, ఫంగస్ మరియు పరాన జీవుల వల్ల వస్తాయి. పందుల పెంపకంలో వివిధ దశల్లో పంది పోషకులకు, వాటిని చూసుకునే వారికి, మరియు పంది మాంసం తినే వారికి కొన్ని జూనోటిక్ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది.

## 1. టీనియాసిస్

- ఇది భద్ర పురుగుల (టేప్ వర్మ్స్) ద్వారా వస్తుంది.
- కాలుష్యమైన ఆహారం లేదా నీటి ద్వారా పందుల నుంచి మనుషులకు వ్యాపిస్తుంది.
- మానవ శరీరంలో ఇది తలనొప్పి, అలసట, మలబద్ధకం వంటి లక్షణాలకు దారి తీస్తుంది.

## 2. జపనీస్ ఎన్సెఫలైటిస్

- ఇది వైరస్ ద్వారా వ్యాపించే వ్యాధి.
- పందుల నుండి దోమల ద్వారా మనుషులకు వ్యాపిస్తుంది.
- తలనొప్పి, స్పృహ కోల్పోవడం, నాడీ సంబంధ సమస్యలు కనిపిస్తాయి.
- నివారణ కోసం దోమల నివారణ, కీటకనాశక మందుల వినియోగం అవసరం.

## 3. ఎరిసిపెలాస్ (ఎరిసిపెలోత్రిక్స్ రూసియోపత్రి బాక్టీరియా వల్ల)

- ఇది పందుల చర్మంపై ఎరుపు లేదా ఊదారంగులో డైమండ్ ఆకారపు గాయాలు కలిగిస్తుంది.
- మనుషులకు సోకినప్పుడు చేతులు, కాళ్లు, వేలు ఎర్రటి పురుపులతో కనిపిస్తాయి.

## 4. స్వైన్ ఇన్ఫ్లుఎంజా

- ఈ వ్యాధి పందుల దగ్గు, తుమ్ము, ముక్కు ద్రావాల ద్వారా వ్యాపిస్తుంది.
- తలనొప్పి, జ్వరం, ఒంటినొప్పులు, శ్వాస సంబంధిత సమస్యలు కనిపిస్తాయి.
- పందుల షెడ్లను పరిశుభ్రంగా ఉంచడం, టీకాలు వేయించడం, అడవి పక్షులను దూరంగా ఉంచడం కీలకం.

## 5. సాల్మొనెల్లాసిస్

- సాల్మొనెల్లా బాక్టీరియా వల్ల వచ్చే వ్యాధి.
- అనారోగ్యంతో ఉన్న పందుల మల, మూత్రాల ద్వారా వ్యాప్తి చెందుతుంది.
- జ్వరం, కండరాల నొప్పి, తలనొప్పి, డయేరియా వంటి సమస్యలు కలిగిస్తుంది.
- నివారణ కోసం షెడ్లను పరిశుభ్రంగా ఉంచడం, పందులను గుంపులుగా ఉంచడం తగ్గించడం, బయోసెక్యూరిటీ పాటించడం అవసరం

## 6. లెప్టోస్పిరోసిస్

- ఇది లెప్టోస్పిరా బాక్టీరియా వల్ల వచ్చే వ్యాధి.
- ముఖ్యంగా పందుల మూత్రం లేదా మలంతో కలుషితమైన నీరు, మట్టి, ఆహారం ద్వారా మనుషులకు వ్యాపిస్తుంది.
- జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, కళ్లలో ఎర్రదనం, ఊపిరితిత్తుల వ్యాధులు, కాలేయ మరియు మూత్రపిండ సమస్యలు రావచ్చు.
- నివారణ కోసం పందుల పారిశుధిక పరిశుభ్రత పాటించడం, కాలుష్యమైన నీటి వినియోగాన్ని తగ్గించడం, వ్యాధిగ్రస్తమైన పందులకు చికిత్స ఇవ్వడం అవసరం.

## నివారణ చర్యలు:

- పందుల షెడ్లను పరిశుభ్రంగా ఉంచడం
- బయోసెక్యూరిటీ విధానాలను పాటించడం
- దోమలు, ఇతర కీటకాలను నియంత్రించడం
- పందులకు సమయానికి టీకాలు వేసే విధానం పాటించడం
- అడవి పక్షులు, ఇతర జంతువులను పందుల దగ్గరికి రానివ్వకుండా చూడటం
- కాలుష్యమైన ఆహారం, నీరు తినకుండా చూసుకోవడం
- జూనోటిక్ వ్యాధుల నివారణ ద్వారా పందుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, మానవ ఆరోగ్యాన్ని కూడా రక్షించుకోవచ్చు.

పందులలో నట్టల నివారణ మందు తాగించే షెడ్యూలు

| | |
|---|---|
| 0-14 | రోజులకుఒకసారి |
| 14- 30 | రోజులకురెండవసారి |
| 1-3 | నెలలుమూడవ సారి |
| 3-6 | నెలలునాలుగవసారి |
| ప్రతి3-4-5 | ఒకసారి |

Deworming Drugs:

Piperzine- 200-400 mg/kg bwt

Albendazole- 5-10 mg/kg bwt

Levamisole -7.5 mg/kg bwt

Oxyclozanide – 15-20 mg/kg bwt

Rafoxanide -10-20 mg/ kg bwt

InIvrmectin- 1ml/50 kg bwt

## వ్యాక్సినేషన్ షెడ్యూల్

| వ్యాక్సిన్ | మొదటి డోసు | రెండవ డోసు |
|---|---|---|
| స్వైన్ ఫీవర్ వ్యాక్సిన్ (CSF) | 3 నెలల వయసులో మొదటి డోసు,<br>21 రోజుల తరువాత బూస్టర్ | 6 నెలలకు ఒకసారి |
| HS (Haemorrhagic Septicemia) | రెండునెలల వయసులో ఉన్నప్పుడు తరువాత సంవత్సరానికి | ప్రతి సంవత్సరానికి |
| FMDఫుట్అండ్మౌత్ | 6 నెలల వయసులో ఉన్నప్పుడు | ప్రతి సంవత్సరానిక |






మరిన్ని వివరాలకు:

ప్రధాన శాస్త్రవేత్త మరియు శాస్త్రవేత్త

**(వెటర్నరి),కృషి విజ్ఞాన కేంద్రం, లాం, గుంటూరు**

email: kvklamguntur@gmail.com

★★★ధన్యవాదలు★★★




కృషి విజ్ఞాన కేంద్రం శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయం

లాం, గుంటూరు- 522007

भाकृअनुप-कृषि तकनीकी अनुप्रयोग अनुसंधान संस्थान (अटारी)

ICAR-Agricultural Technology Application Research Institute (ATARI)

Zone-X/क्षेत्र 10, क्रीडा परिसर/CRIDA Campus, संतोषनगर/Santoshnagar, हैदराबाद/Hyderabad - 500059

An ISO 9001:2015 Certified Institute